క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన గాలిపెల్లి గంగమ్మ కుటుంబానికి వసుధ ఫౌండేషన్ తరపున శనివారం ఆర్థిక సాయం అందజేశారు. వారం రోజుల క్రితం గంగమ్మ ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సుండికి గ్రామానికి చెందిన భూపతి రెడ్డి వసుధ ఫౌండేషన్ తరపున రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విలాస్ రెడ్డి, సర్పంచ్ నర్సింగ్, మార్కెట్ డైరెక్టర్ చందర్ రెడ్డి, రమేశ్, కర్నేవార్ స్వామి పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గడ్డం రమణ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ తుల శ్రీనివాస్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, స్వామి, రమేశ్, రాజేశ్వర్, జుగాది రావ్, విజయ్, భీంరావ్, శ్రీనివాస్, భీముడు, లింగు, సోమేశ్వర్ ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారులోని బేల్లూరి అయ్యప్ప స్వామి ఆలయం కమిటీ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంబోజి సూర్యకాంత్, రవీందర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలపై చర్చించడం జరిగిందన్నారు. అనంతరం ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కుంబోజి సూర్యకాంత్, రవీందర్, కోశాధికారిగా నరేశ్‌లను ఎన్నుకున్నారు. నాయకులు దారట్ల జీవన్, అనిల్ దేశ్‌పాండే, శ్రీనివాస్, ఈర్ల సత్యనారాయణ, దిలీప్, గణేశ్ పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప సభకు తరలిన నాయకులు



తరలివెళ్తున్న నాయకులు

బోథ్: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన మాదిగ విశ్వరూప సభకు మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. మందకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగే సభకు ప్రధాని మోదీ రానుండటం, వర్గీకరణ ప్రకటనపై ఆశాభావం వ్యక్తం చేశారు. సభకు తరలిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు గణేశ్, మండల అధ్యక్షుడు అడ్డిగ స్వామి, పట్టణ అధ్యక్షుడు రవి, దాసరి గంగయ్య, పాలెపు గోపి, కొంకటి గంగాధర్, రాజేశ్వర్, రవీందర్, నల్ల చిన్నయ్య, అన్నెపాక అశోక్, పంచాక్షరీ పాల్గొన్నారు.

నేరడిగొండ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన విశ్వరూప మహాసభకు మండలంలోని మాదిగలు తరలివెళ్లారు. బుగ్గారం, గుత్పాల, కుమారి, తేజాపూర్, బుద్దికొండ, గ్రామాలకు చెందిన నాయకులు శనివారం ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు బయల్దేరారు. ఎస్సీలలో ఉన్న 59 కులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు.

జీఆర్ కుర్మేను పరామర్శించిన కవులు



పుస్తకం అందజేస్తున్న కవులు

నేరడిగొండ: మండలానికి చెందిన ప్రముఖ కవి జీఆర్ కుర్మేను కవులు పరామర్శించారు. ఆయన అనారోగ్యం బారిన పడడంతో శనివారం తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదారి నారాయణ, జిల్లా అధ్యక్షుడు బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్, కవులు ప్రశాంత్, సత్యనారాయణ, గడ్డం భీంరెడ్డి, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్నలు పరామర్శించారు. ఇదిలా ఉండగా ఉదారి నారాయణ రచించిన 'మళ్లీ మనిషిలోకి కవిత సంకల్పాన్ని' జీఆర్ కుర్మేకు అందజేశారు.

మధురం.. సీతాఫలం





కొనుగోలు చేస్తున్న ప్రజలు

- అనేక ఆరోగ్య ప్రయోజనాలు
- మార్కెట్లో జోరుగా అమ్మకాలు
- వర్షాల్లేక తగ్గిన దిగుబడి
- పెరిగిన ధర

సీతాఫలాలు విక్రయిస్తున్న వ్యాపారులు



సండే స్పెషల్

కైలాస్‌నగర్: శీతకాలంలో లభించే పండ్లలో సీతాఫలం ప్రధానమైంది. మధురమైన రుచితో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. సీతాఫలాల్లో ఉండే విటమిన్(బి), విటమిన్(సీ), పోటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వివిధ రుగ్మతలను దూరం చేసి ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతాయి. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్‌లో సీతాఫలాలను విక్రయిస్తున్నారు. ఈఏడాది సకాలంలో వర్షాలు లేకపోవడంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఫలితంగా ధర పెరిగింది. ఒక్కో పండు ధర రూ.30 నుంచి రూ.50 పలుకుతోంది. సామాన్యుల పండుగా పలువబడే సీతాఫలం రుచి చేదెక్కింది.

ధరలు ప్రియం..

అడవులకు పెట్టింది పేరైన ఆదిలాబాద్ జిల్లాలో సహజంగా సీతాఫలాలు దొరుకుతాయి. దీంతో పలువురు ఆదివాసీలు ఈఫలాలు సేకరించి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఇటీవల చాలా మంది రైతులు సీతాఫలం తోటలను పెంచుతున్నారు. తోటలను కులవృత్తిపై ఆధారపడి జీవించే ముదిరాజ్‌లు లీజుకు తీసుకుంటారు. ఫలాలను మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తారు. ఫలం చేతికచ్చే సమయంలో సరైన వర్షాలు కురవకపోవడంతో కాత తగ్గింది. దీంతో దిగుబడి ప్రభావం చూపింది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.200లకు అర డజన్ సీతాఫలాలను విక్రయిస్తున్నారు.

నష్టపోయాం



సీతాఫలం తోటలను రూ.5 లక్షలకు లీజుకు తీసుకున్నాం. కాయ ఏదిగే దశలో వర్షాలు పడకపోవడంతో పూర్తిస్థాయిలో ఎదుగక ఆశించిన స్థాయిలో దిగుబడి తగ్గిపోయింది. ఇప్పుడిప్పుడే ఫలాలు చేతికి వస్తున్నాయి. గిరాకీ ఎక్కువగా రావడం లేదు. దీంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది.

– చింతల ఆశమ్మ, చిరు వ్యాపారి

ఆరోగ్యానికి ఎంతో మేలు..



సీతాఫలాల్లో ఉండే పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా తోడ్పడుతుంది. విటమిన్(సీ), విటమిన్(బీ6)లు డిప్రెషన్, నరాల సమస్యలు రాకుండా చేస్తోంది. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది.

– డా.సుమలత, ఎండీ ఫిజిషియన్

ధరలు మండుతున్నాయి



ప్రతిఏటా సీతాఫలాలు కొనుగోలు చేస్తుంటాం. పండ్లు రుచికరంగా ఉండడంతో పిల్లలు తినేందుకు ఇష్టపడుతారు. ఈ ఏడాది కొనుగోలు చేయడం పెనుభారమే అవుతుంది. సీతాఫలాల ధరలు మార్కెట్‌లో మండిపోతున్నారు. రూ.25 నుంచి రూ.30 పెడితే తప్ప పండు రావడం లేదు.

– అడెల్లు, కొనుగోలుదారుడు

నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

- బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు



మాట్లాడుతున్న సోయం బాపూరావు

తలమడుగు: బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తే బోథ్ నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని బోథ్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ సోయం బాపూరావు అన్నారు. శనివారం మండలంలోని సుంకిడి గ్రామంలో లింగీ, లాపూర్, ఝరి గ్రామాలకు చెందిన యువకులు, మహిళలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజలు రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, రాజు యాదవ్, స్వామి, సంతోష్ రెడ్డి, కిరణ్, హనీష్, నాగార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు బీజేపీ పాలన కోరుకుంటున్నారు

తాంసి: ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారని బోథ్ బీజేపీ అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. శనివారం తాంసి మండల కేంద్రంతో పాటు జామిడి, కప్పర్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యం నడుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, సుభాష్, రాజు యాదవ్, పోచ్చన్న, లస్మన్న, దత్తు పాల్గొన్నారు.

బోథ్: దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీకి ఓటు వేయాలని మండల కన్వీనర్ సుభాష్ సూర్య అన్నారు. శనివారం మండలంలోని అందూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. సోయం బాపూరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ రెడ్డి, వెంకటేశ్, మానాల శేఖర్, బోరె రవీందర్, బారె భోజన్న, గోపాల్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదరించండి.. సేవకుడిలా పని చేస్తా

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్



ఖానాపూర్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాన్సన్‌నాయక్



జన్నారం: పార్టీలో చేరిన వారితో జాన్సన్ నాయక్

ఖానాపూర్: ఎమ్మెల్యేగా ఆదరిస్తే సేవకుడిలా పని చేస్తానని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కాలేరి జనార్దన్, లాండేరి చందు, గాండ్ల నాగరాజు, తదితరులు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని చెరువులు, కుంటలను మినీట్యాంకుబాండ్‌గా మారుస్తానన్నారు. ఖానాపూర్‌లో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కిశోర్, చంద్రహాస్, లింగన్న, రాకేశ్, రాజేశ్వర్, కళావతి పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతు సైకిల్‌పై గడ్డిమోపుతో ఇంటికి వస్తున్న సందర్భంగా ఎంపీపీ జైవంత్‌రావు రైతును ఆపి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ.. జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జన్నారం: జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం సర్పంచ్ జాడి గంగాధర్ అధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలు అయ్యే వరకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, యువకులు పాల్గొన్నారు.

116 కొబ్బరికాయలు కొట్టిన అభిమాని..

జాన్సన్ నాయక్ భారీ మెజార్టీతో గెలవాలని జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన ఒదేల మనోజ్ వేములవాడలో 116 కొబ్బరికాయలు కొట్టాడు. ఆయన అభిమానిగా, గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ కార్తీక్ రావు, గ్రామ పెద్దలు మనోజ్‌ను అభినందించారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె అన్నారు. శనివారం మండల కేంద్రంతో కేస్లాగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు కోరెంగా సుంకట్‌రావ్, మీర్జా జీలానిబేగ్, గేడం భరత్, పద్వాల్ గోపాల్‌సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి



దండారీలతో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రామన్న



పార్టీ కండువా కప్పుతున్న జోగు రామన్న

- ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచికంటి, అసోదా, రాములు గూడ, మత్తడి గూడ, ధర్‌లొద్దీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గిరిజన గ్రామాల్లో పర్యటించిన ఆయన దండారీలతో కలిసి నృత్యం చేశారు. 70 ఏళ్ల పాలనలో కాంగ్రెస్, బీజేపీ చేయని అభివృద్ధిని బీఆర్ఎస్ చేసి చూపిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, బొమ్మకంటి రమేశ్, సెవ్వ జగదీష్, కుర్ర శ్రీనివాస్, కనక రమణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్షాలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్ టాక్సీ యూనియన్ సభ్యులు, డ్రైవర్లు బీఆర్ఎస్‌లో చేరారు. మేడిగూడ (ఆర్) గ్రామానికి చెందిన బీజేపీ వార్డు సభ్యులు గేడం విట్టల్, గంగారాం ఆధ్వర్యంలో గ్రామస్తులు పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అష్రఫ్, సాజిదోద్దీన్, దుర్వ నగేశ్, పర్వీన్, ఫెరోజ్, పర్వీన్ సుల్తానా, శివకుమార్, మహేందర్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పట్టణంలోని ఖానాపూర్, అంబేద్కర్‌నగర్ కాలనీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కిల్లా పంజేశా, పర్కోట కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలతో పాటు మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం విద్య, వైద్యం వంటి రంగాలకు తగు ప్రాధాన్యతనిచ్చి నూతన సంస్కరణలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కోఆప్షన్ సభ్యులు ఎజాజ్, మోబిన్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాఆశీర్వాద సభ విజయవంతం చేయండి

బోథ్: ఇచ్చోడలో ఈనెల 16న నిర్వహించే ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచ్ సురేందర్, కదం ప్రశాంత్, రుక్మణ్ సింగ్, ముత్యంరెడ్డి, ప్రశాంత్, జగన్‌రెడ్డి, బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిరికొండ: ప్రజాఆశ్వీరాద సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. శనివారం మండలంలోని గోధుమల్లే గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనిల్‌జాదవ్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటన్న, ఎక్బాల్, చందు, మాజీ ఎంపీపీ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తలమడుగు: ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించే ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, సీనియర్ నాయకులు కేదారేశ్వర్ రెడ్డి కోరారు. శనివారం మండలంలోని సుంకిడి గ్రామంలో మాట్లాడారు. ఈనెల 16న నిర్వహించే సభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, అబ్దుల్లా, మహేందర్ యాదవ్, వెంకన్న, కీర్తి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, ఆశన్నయాదవ్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం'



ఇచ్చోడ: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కానిందే ఉద్ధవ్, మరో 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకక రోజుకు ఒక అభ్యర్థిని మారుస్తున్నారని విమర్శించారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని కేశవపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైనార్టీల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గోడం నగేశ్, ఎంపీపీ ప్రీతం రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

నేరడిగొండ: బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం నేరడిగొండ బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, వార్డు సభ్యులు బండి లింగన్న, ఇందూర్ గంగాధర్, నాయకులు కొప్పుల దినేష్‌లు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నాయకుల ప్రచారం

మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ రాథోడ్ సజన్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అల్లూరి శివారెడ్డి, పండరి, మందుల రమేశ్, సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్ సింగ్, గడ్డం భీంరెడ్డి, గాదె శంకర్, సర్పంచులు పాల్గొన్నారు.

బోథ్: రైతన్నా.. మీ ఓటు నాకే వేయాలని బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ కోరారు. శనివారం మండలంలోని కౌఠ(బి) గ్రామానికి వచ్చిన ఆయన కొద్దిసేపు రైతులతో ముచ్చటించారు.

గుడిహత్నూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను విమర్శించే స్థాయి జెడ్పీటీసీ పతంగి బ్రహ్మానంద్‌కు లేదని పీఏసీఎస్ చైర్మన్ సంజీవ ముండే అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. నాయకులు స్థాయిని బట్టి విమర్శలు చేయాలని హితవు పలికారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు జమీర్, సుధాకర్ రెడ్డి, జాదవ్ రమేశ్, మాధవ్ కేంద్రే సలీంఖాన్, రావణ్ ముండె, ససానే సిద్ధార్థ్ పాల్గొన్నారు.

దీపావళి సందడి



ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా దీపావళి సందడి మొదలైంది. హిందువులకు పెద్ద పండుగ కావడంతో మార్కెట్ పరిసరాలు కిటకిటలాడాయి. బంతిపూలు, టపాసులు, విద్యుత్ దీపాలు, ముగ్గుల రంగులు కొనుగోళ్లతో సందడి నెలకొంది. శనివారం రాత్రి తమ ఇళ్లను విద్యుత్ దీపాలతో ప్రజలు అలకరించారు.



విద్యుత్ దీపాలతో అలకరించిన ఇల్లు



లక్ష్మీదేవి ప్రతిమలను కొనుగోలు చేస్తున్న మహిళలు



ప్రమీద

'విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి'

ఎదులాపురం: విద్యారంగానికి అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించాలన్నారు.